# సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 30 । జూలై । 2023





## సాధారణ స్థితికి పార్వతి బ్యారేజీ

మంథని: పార్వతీ బ్యారేజీ సామర్థ్యం 8.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.043 టీఎంసీలు మాత్రమే ఉంది. ఎగువ నుంచి 3,01,000 క్యూసెక్కులు వస్తుండగా.. 54 గేట్లు ఎత్తి కిందకు పంపిస్తుండడంతో వెలవెలబోతోంది.



## గోదారమ్మకు ప్రత్యేక పూజలు

గోదావరిఖని: నిండుకుండలా మారిన గోదారమ్మకు పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిఖని సమీపంలోని గోదావరిబ్రిడ్జిపై నుంచి పూలు, పండ్లు, చీరె, సారె సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన సీపీ



పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

జ్యోతినగర్: వరద ముంపు ప్రాంతాన్ని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి శనివారం పరిశీలించారు. కార్పొరేషన్ 23వ డివిజన్ సుభాష్‌నగర్, మోమీన్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. జెన్‌కో యాష్‌పాండ్ నుంచి నీరు వచ్చినట్లు తెలుసుకుని ప్రాజెక్టు ఎస్‌ఈ సూర్యనారాయణరెడ్డితో మాట్లాడారు. నివాస ప్రాంతాల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, మరమ్మతు పనులు వేగంగా చేయాలని సూచించారు. ఏసీపీ తుల శ్రీనివాసరావు, సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్, జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

**పర్యాటకులకు నో పర్మిషన్**

పెద్దపల్లిరూరల్: మండలంలోని గట్టుసింగారం జలపాతానికి పర్యాటకులకు అనుమతి లేదని సీపీ సూచించారు. శనివారం సబ్బితం జలపాతం ప్రాంతాన్ని సందర్శించారు. ఇటీవల జలపాతంలో మునిగి వెంకటేశ్ అనే యువకుడు మరణించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసేందుకు సహకరించిన గ్రామస్తులు మాదాసు శ్రీనివాస్, ఆకుల గట్టయ్య అభినందించారు. డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేశ్, తులా శ్రీనివాసరావు, పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, సతీష్, సత్యనారాయణ, బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తదితరులున్నారు.

### యాదవులకు 22 సీట్లు కేటాయించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని/సుల్తానాబాద్: రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్న యాదవులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 22 స్థానాలు, మూడు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని యాదవ విద్యావంతుల వేదిక, యాదవ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ రాజకీయ పార్టీలకు సూచించారు. ఆగస్టు 13న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గోదావరిఖని, సుల్తానాబాద్‌లో శనివారం ఆవిష్కరించారు. యుద్ధభేరికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు దూడిమెట్ల రాజేందర్, బాలరాజ్ యాదవ్, మేకల మల్లేశం, పాతపెల్లి రవికుమార్, మెండె లింగయ్య, న్యాయవాది వేల్పుల మురళీధర్, దూడిమెట్ల శ్రీనివాస్, ఆవుల లక్ష్మీరాజం, ఆవుల శివకృష్ణ, కూకట్ల గోపి, అమ్ముల భూమయ్య, అజయ్, మహేందర్, కొమ్ము తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.

### పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్



వెంకటేశ్



శ్రీనివాసరెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు.

### 'బండి' నియామకంపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై జిల్లాకేంద్రంలో ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు, మేకల శ్రీనివాస్, దాడి సంతోష్, రాజేశ్వర్‌రావు పాల్గొని మిఠాయిలు పంచారు. నాయకులు సంపత్, వెంకటరమణారావు, శ్రీకాంత్, కిరణ్, మనోహర్, ప్రమోద్‌రావు, అంజి, వేణు, సుధాకర్, ప్రభాకర్ శివ, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

# నదుల తీరం.. నష్టం అపారం

## ఏటా ముంపు.. కలగని కనువిప్పు



ఈ ఫొటోలోని రైతు బండారి లక్ష్మణ్. మంథని మండలం గోపాల్‌పూర్ మానేరు తీరంలో ఆరెకరాల పొలం సాగుచేస్తున్నాడు. డ్రమ్‌సీడర్ ద్వారా నాటువేశాడు. పొలం ఒర్రె అవతలివైపు ఉండడంతో సాగుకు సరిపడా ఎరువు బస్తాలను ఒడ్డుకు చేర్చుకుంటాడు. ఈ ఏడాది కూడా 52 ఎరువుల బస్తాలను తన పొలం ఒడ్డుపై నిల్వ చేసుకున్నాడు. మానేరు ఉధృతంగా ప్రవహించి బస్తాలన్నీ కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పొలంలో మట్టి, ఇసుక మేట వేసిందని, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయిందని రోదిస్తున్నాడు. మళ్లీ నాటు వేయడం కష్టమేనని ఆందోళన చెందుతున్నాడు. ఇది ఒక్క లక్ష్మణ్ ఆవేదన మాత్రమే కాదు గోదావరి, మానేరు తీరంలోని వందలాది మంది రైతుల గోడు.



మంథని గోదావరి తీరంలో నీట మునిగిన వరినారు

- రైతులను ముంచుతున్న గోదావరి, మానేరు
- బ్యాక్ వాటర్‌తో పొలాల్లో ఇసుక మేటలు
- ఏటా వందలాది ఇళ్లు నేలమట్టం
- కనిపించని నివారణ చర్యలు
- మూడేళ్లుగా పైసా ఇవ్వని సర్కారు
- ఈ సారైనా ఆదుకుంటుందనే ఆశలు

మంథని: ఏటా గోదావరి, మానేరు, బొక్కలవాగు వరదలకు పంట భూములు, ఇళ్లు నీట మునిగి కోట్లలో నష్టం వాటిల్లుతున్నా.. ప్రభుత్వం పైసా పరిహారం చెల్లించడం లేదు. కనీసం ముంపు నివారణ చర్యలైనా చేపట్టకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది వరద సృష్టించిన బీభత్సానికి మంథని డివిజన్ ప్రజలు అతలాకుతలం కాగా.. తాజాగా వారంపాటు కురిసిన భారీ వర్షాలు.. వరదల కారణంగా మరోమారు అపార నష్టం వాటిల్లింది. ఈసారి ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందనే ఆశల్లో అన్నదాతలు ఉన్నారు.

**భారీ వర్షమొస్తే మునకే..**

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మూడేళ్లుగా గోదావరి, మానేరు, బొక్కలవాగు తీరం వెంట పంట పొలాలు, ఇళ్లు మునుగుతున్నాయి. ఈ తంతు ఏటా జరుగుతోంది. భారీ వర్షం పడితే చాలు బ్యాక్ వాటర్ తీరం వెంట ఉన్న మంథని మండలం సిరిపురం, బెస్తపల్లి, గుంజపడుగు, పోతారం, విలోచవరం, ఖానాపూర్, ఎక్లాస్‌పూర్, ఖాన్‌సాయిపేట, అమ్మవారిపల్లి, వెంకటాపూర్, ఆరెంద, మల్లారం, నాగేపల్లి, అడవిసోమన్‌పల్లి, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ఇతరత్రా గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఇలా గతేడాది 11 వేల ఎకరాల పంట, రెండు వేల ఇళ్లు నీట మునిగాయి. వందలాది ఎకరాల్లో ఇసుక మేట వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటీవలి వరదలకు కూడా పది వేలకు పైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇసుక మేటలు వేసి మళ్లీ పంటలు వేసే పరిస్థితి లేకుండా చేసింది.



చిన్నఓదాలలో పొలంలో పడిన విద్యుత్ స్తంభం

**ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ..?**

గోదావరి తీరం వెంట ఉన్న భూములు బ్యాక్ వాటర్‌లోనే మునిగి ఉంటున్నాయని కాళేశ్వరం ప్రాజెక్టు నీటి పారుదల శాఖ అధికారులు సర్వే నిర్వహించి ఏడాది క్రాప్ హాలీడే ప్రకటించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాని ప్రభుత్వం రెండేళ్ల నుంచి పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వడంలేదు. తీర ప్రాంత భూములు, ఇళ్లకు ముంపు లేకుండా నివారణ చర్యలు చేపట్టడం లేదు. కరకట్టల నిర్మాణం..లేదా ఇతరత్రా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తోంది.

**పరిహారంపై ఆశలు**

ఏడాది క్రితం ఇదే నెలలో భారీ వర్షాలు, వరదలు మంథని డివిజన్ ప్రజలను కోలుకోలేని దెబ్బతీశాయి. ఒక్కో కుటుంబం రూ.10వేల నుంచి రూ.10 లక్షల వరకు నష్టపోయింది. ఆ చేదు జ్ఞాపకాలను ఇంకా మరువకముందే తాజాగా భారీ వర్షాలు, వరదలు ఈ ప్రాంత ప్రజలను ముంచాయి. గోదావరి, మానేరుతో పాటు బొక్కలవాగు ఉప్పొంగడంతో బ్యాక్ వాటర్‌తో భారీ నష్టం వాటిల్లింది. గతేడాది రూ.వందకోట్ల మేర నష్టం వాటిల్లితే.. ఈసారి మంథని మున్సిపాలిటీ మినహా ఆ స్థాయిలో నష్టం జరిగింది.

### కాళేశ్వరం శాపంగా మారింది



గోదావరి తీరంలో 1982 నుంచి వ్యవసాయం చేస్తున్న. మూడేళ్ల నుంచి ఏటా పంట మునుగుతోంది. కాళేశ్వరం కట్టినప్పటి నుంచే పంటకు నష్టం వాటిల్లుతోంది. గత సంవత్సరం పంట వేసుకున్నాక మునిగితే ఈ సారి నారు పోసినంక వరద వచ్చింది. వర్షాలు రాకముందు ప్రాజెక్టు నింపి వరద రాగానే ఇడుస్తున్నరు. దీంతో మేం నష్టపోతున్నం.

– మూల పురుషోత్తంరెడ్డి, రైతు, మంథని

### పెట్టుబడి మునుగుతున్నం



మూడేళ్ల నుంచి పెట్టుబడి పెట్టి మునుగుతున్న. గత సంవత్సరం ఎరువుల బస్తాలు, ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు కొట్టుకుపోయాయి. ఈ సారి నారు కొట్టుకుపోయింది. కరెంట్ స్టార్టర్లు పోయినయ్. ఏటా నష్టమే. గంగొడ్డు భూములకు ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించి తీసుకోవాలి.

– కుంట్ల శ్రీనివాస్, అమ్మగారిపల్లి, ఖాన్‌సాయిపేట

### రేకుల షెడ్డు కొట్టుకుపోయింది



మాది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కైకలూరు. రెండేళ్ల క్రితం మంథనికి వలస వచ్చాం. భార్యాభర్తలం ఇక్కడే గోదావరి తీరంలో రేకుల షెడ్డు వేసుకొని తలదాచుకుంటున్నాం. చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నం. రెండేళ్లుగా గోదావరి వరద ముంచుతోంది. ఈ సారి రేకుల షెడ్డు కొట్టుకుపోయింది. 33 చేపలు పట్టె బుట్టలు పోయినయ్. రూ.80 వేల వరకు నష్టం జరిగింది.

– ఘంటసాల గంగారాం, కైకలూరు, కృష్ణ జిల్లా



వరద తాకిడికి కోతకు గురైన తొగర్రాయి నుంచి కదంబాపూర్ వెళ్లే తారు రోడ్డు

# వరద మిగిల్చిన కష్టం

- జిల్లావ్యాప్తంగా 30 రోడ్లు ధ్వంసం
- తాత్కాలిక మరమ్మతుకు రూ.3కోట్ల అంచనా
- శాశ్వత నిర్మాణాలకు రూ.30 కోట్ల పైమాటే..

సుల్తానాబాద్: సుమారు మూడు రోజులపాటు భారీ వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లాలో గోదావరి, మానేరు, హుస్సేనిమియా వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఊహించని రీతిలో వరద ముంచెత్తింది. మానేరు వాగు, హుస్సేమియాలో వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది. ఎల్ఎండీ నుంచి కేవలం నాలుగు గేట్ల ద్వారానే నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం ఉదయానికి వరద సాధారణ స్థాయికి చేరుకోనుంది.

**భారీగా పంట నష్టం..**

జిల్లాలో వర్షానికి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. పంట నష్టాన్ని అంచనా వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి ఏఈఓలకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 1016 చెరువులు పూర్తిగా నిండాయి. జలాలు ఆశాజనకంగా ఉన్నాయని, వాటి ఆయకట్టులో పంటల సాగుకు ఇబ్బంది లేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.ఇసుకమేటలు వేసింది 5887 ఎకరాలుగా తేల్చారు.

**దెబ్బతిన్న రోడ్లు**

వరదలకు జిల్లావ్యాప్తంగా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 30 రోడ్లు దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతు కింద రూ.3 కోట్లతో అంచనా వేసి ప్రభుత్వానికి పంపినట్లు రోడ్లు భవనాల శాఖ డీఈ రాములు తెలిపారు. శాశ్వత ప్రతిపాదికన పూర్తిచేయాలంటే 30 రోడ్లకు రూ.30 కోట్లు అవసరం ఉంటుందని నివేదించినట్లు పేర్కొన్నారు.

**ఇళ్లకు చేరుకుంటున్న బాధితులు**

వరదల కారణంగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారు తిరిగి వారివారి నివాసాలకు చేరుకుంటున్నారు. తమతమ ఇళ్లలో తడిచిన మంచాలు, ఫ్రిజ్‌లు, బియ్యం, నిత్యావసరాలను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. బయట చెత్త, ఇంట్లో బురదతో నరకయాతన పడుతున్నారు. ముఖ్యమైన పత్రాలు, చిన్నారులు చదువుకునే పుస్తకాలు సైతం తడిసి ముద్దయ్యాయి.



మానేరు తీరంలోని పొలాల్లో ఇసుక మేటలు



కొట్టుకుపోయిన నీరుకుల్ల వెళ్లే తారురోడ్డు



గట్టెపల్లి వెళ్లే దారిలో వరిపొలాల్లో ఇసుక



నీరుకుల్ల వంతెనకు సమీపంలో ధ్వంసమైన రోడ్డు

**మానేరు ప్రాంతంలో..**

మానేరు విస్తరించి ఉన్న సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి, నీరుకుల్ల, మంచర్యామి, ఓదెల మండలం గుండ్లపల్లి, కనగర్తి, గుంపుల, కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్‌తోపాటు చివరి గ్రామం వరకూ రోడ్లు భారీగా దెబ్బతిన్నట్లు ఆ ప్రాంతం ప్రజలు చెబుతున్నారు. గ్రామాలకు వచ్చే మంచినీటి పైప్‌లైన్లతోపాటు రైతుల మోటార్లు, పలురకాల సామగ్రి దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 47 అడుగుల మట్టి గణపతికి శ్రీకారం



కర్రపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఛత్రపతి యువసేన నాయకులు

- కర్రపూజతో విగ్రహ నిర్మాణ పనులు ఆరంభం
- హాజరైన మున్సిపల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో ఈఏడాది 47 అడుగుల ఎత్తైన మట్టి వినాయకుడిని నెలకొల్పేందుకు ఛత్రపతి యువసేన వ్యవస్థాపకుడు శివంగారి సతీశ్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటా ప్రతిష్ఠించే గణనాథుడి విగ్రహమూర్తి పనులను శనివారం కర్రపూజ కార్యక్రమంతో ప్రారంభించారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్ తదితరులు హాజరయ్యారు. మట్టితో తయారుచేసిన గణపతిని ఐదేళ్ల కాలంగా ప్రతిష్ఠిస్తున్నామని సతీశ్ తెలిపారు. కౌన్సిలర్లు మల్లయ్య, భిక్షపతి, రాజంమహంత, కార్తీక్, స్వామి, నాయకులు రాజు, అల్లెంకి శ్రీనివాస్, ఓంప్రకాశ్, దేవనంది శ్రీనివాస్, నరేశ్, రాజేశ్, వంశీరాజ్, హరీశ్, రాధస్వామి, మహేశ్, నరేందర్, సతీష్, అఖిల్, రాకేశ్, వేణు, రమేశ్ తదితరులున్నారు.



## పీరీలకు కోరుకంటి, రాజ్‌ఠాకూర్ ప్రార్థనలు

గోదావరిఖనిటౌన్/ఫెర్టిలైజర్‌సిటీ: మొహర్రం సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో పీరీలను ఎమ్మెల్యే కోరుకంటి చందర్, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దర్శించుకున్నారు. అలయ్‌బలయ్ తీసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా రాజ్‌ఠాకూర్‌కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో పీరీలను దర్శించుకున్నారు.



## జపాన్‌లో జరిగే 'ఇన్‌స్పైర్'కు జిల్లా విద్యార్థికి ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని దాసరి హర్షితకు జపాన్‌లో నవంబర్ 5నుంచి 11వరకు నిర్వహించే ప్రదర్శనలో పాల్గొనాలని ఆహ్వానం అందిందని డీఈవో మాధవి తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తాచాటిన హర్షిత కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేతులమీదుగా అవార్డు అందుకుంది. ఏప్రిల్ 10నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫైన్ కార్యక్రమంలో పాల్గొని సత్తాచాటింది. జాతీయస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎనిమిది మందిలో దాసరి హర్షితకు జపాన్‌లో పాల్గొనే అవకాశం దక్కడంపై డీఈవో హర్షం వ్యక్తం చేశారు. హర్షిత గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌ను డీఈఓ మాధవి, సైన్స్ అధికారి రవినందన్‌రావు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయస్థాయి ప్రదర్శనలో హర్షిత



రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ప్రదర్శనను వివరిస్తున్న హర్షిత(ఫైల్)

## క్లుప్తంగా

### ఆర్టిజన్ల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఆర్టిజన్లు

రామగుండం: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి ఆరేళ్లయిన సందర్భంగా శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భరోసా కల్పించిందని, త్వరలోనే పర్మినెంట్ ఉద్యోగులకు వర్తించే పేస్కేల్, ఇతరత్రా అలవెన్సులు అందించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ – 1535 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, బ్రాంచ్ అధ్యక్షుడు అబ్దుల్ నజ్మీ, ఆర్టిజన్లు చంద్రమౌళి, ఖలీమొద్దీన్, అన్వర్ హుస్సేన్, ఫిర్దోస్, నయీంపాషా, సతీశ్, వసీం, చంటి, రశీద్, ఎజాజ్‌ఖాన్, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ నిజాయితీ

గోదావరిఖని: గోదావరిఖని బస్టాండ్ అడ్డాకు చెందిన ఆటోడ్రైవర్ బండి రాజు తన ఆటోలో ప్రయాణికుడు మర్చిపోయిన ఫోన్ అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. కరీంనగర్‌కు చెందిన పూసాల రవి గోదావరిఖని బస్టాండ్ నుంచి ఫైవింక్లయిన్‌కు వెళ్తుండగా ఆటోలో రూ.20వేల విలువగల మొబైల్ మర్చిపోయాడు. ఆటోడ్రైవర్ గుర్తించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా, బాధితుడి వివరాలు తెలుసుకొని ఫోన్ అప్పగించారు. నిజాయితీగా సెల్‌ఫోన్ అప్పగించిన ఆటోడ్రైవర్‌ను ట్రాఫిక్ సీఐ తంగెళ్ల ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి సమీపంలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ శనివారం పెద్దపల్లి నుంచి సుల్తానాబాద్‌కు ఆటోలో వెళ్తుండగా డివైడర్ వద్ద అదుపుతప్పి పెద్దపల్లి వైపు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్మారం: అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన టేకు రాజేశ్ మండలంలోని చామనపల్లిలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.





## అలుగు పారుతున్న

# అన్నల చెరువులు!

### వర్షాలతో జలకళ సంతరించుకున్న జలవనరులు

సాక్షి, కరీంనగర్ డెస్క్: 'కాకతీయులు.. రెడ్డిరాజులు చెరువులు తవ్వించారని.. అశోకుడు మొక్కలు నాటించెను అని చదువుకున్నాం'.. కానీ.. సమసమాజ స్థాపన కోసం ఆయుధాలు చేతపట్టి, అడవుల్లో సంచరించే అన్నలు(నక్సలైట్లు) 26 ఏళ్ల క్రితం రాజన్నసిరిసిల్ల జిల్లాలో చెరువులు తవ్వారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదో అధ్యాయం. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఆ చెరువులు జలకళ సంతరించుకొని మత్తళ్లు దూకుతున్నాయి. 1990–2000 మధ్య కాలంలో సిరిసిల్ల ప్రాంతంలో పట్టున్న సీపీఐ (ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి విప్లవ గ్రూపు నక్సలైట్లు పోటాపోటీగా మూడు చెరువులు తవ్వారు.

- తుపాకులు పక్కనపెట్టి.. తట్టాపారలు పట్టి
- 26 ఏళ్లక్రితం రంగపేట, వద్దిమల్ల, వట్టిమల్ల గ్రామాల్లో చెరువుల తవ్వకం
- ఆనాటి కరువును తీర్చిన నక్సలైట్లు

#### కరువు కోరల్లో పల్లెలు..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట మండలాల్లోని అటవీ గ్రామాల్లో మూడు దశాబ్దాల క్రితం అడవిలో అన్నలదే రాజ్యం. ఏళ్లగా బీడుగా మారిన భూములు.. కరువు కోరల్లో బతుకులు.. చెరువు నిర్మిస్తే బాగుండు.. బుక్కెడు బువ్వ దొరుకుతుందని ఆశించిన నిరుపేదలు.. ఏళ్ల తరబడి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో అడవిలో అన్నలు వీర్నపల్లి మండలంలోని రంగంపేటలో మార్గండి చెరువు (ప్రస్తుతం జంపన్న చెరువు), మద్దిమల్ల రాయిని చెరువు, కోనరావుపేట మండలంలోని వట్టిమల్లలో నారాయణ చెరువు తవ్వి కరువు తీర్చారు.

#### మొదట మద్దిమల్ల చెరువుకు శ్రీకారం..

వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు తవ్వకంలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ (మావోయిస్టు) కీలక పాత్ర పోషించింది. గుట్టల ప్రాంతం నుంచి వచ్చే నీరు వృథాగా ఒర్రెల ద్వారా వెళ్లిపోతోంది. ఆ నీటిని ఆపితే ఊరందరికీ మేలు జరుగుతుందని అప్పటి పీపుల్స్‌వార్ దళ నాయకుడు మధు ఉరఫ్ కొట్టాల మోహన్‌రెడ్డి భావించారు. మద్దిమల్లలో కులాలవారీగా కమిటీలు వేసి, 11 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. టీమ్ లీడర్లను నియమించి, చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 75 రోజులపాటు నిత్యం 600 మంది గ్రామస్తులు ఇందులో భాగస్వాములయ్యారు. సమీప గ్రామాలవారు కూడా నక్సలైట్ల ప్రోద్బలంతో శ్రమదానం చేశారు. సాయుధ నక్సలైట్లు తుపాకులను పక్కనపెట్టి, చెరువు కట్ట పోసేందుకు తట్టలు పట్టి, పని చేయడం విశేషం. ఈ ప్రాంత ట్రాక్టర్ యజమానులు సైతం సహకారం అందించడంతో చెరువు నిర్మాణం పూర్తయింది. నక్సలైట్ల నేతృత్వంలో తవ్విన తొలి చెరువు ఇదే. ఈ వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు మత్తడి దుంకుతోంది.

#### నెలరోజుల్లో పూర్తయిన 'జంపన్న'..

మావోయిస్టులు మద్దిమల్లలో చెరువు నిర్మించడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సీపీఐ(ఎంఎల్) జనశక్తి అప్పటి జిల్లా కార్యదర్శి జంపన్న వీర్నపల్లి మండలంలోని రంగంపేట శివారులో మార్గండి చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. ఊరిలోని కుల సంఘాలను ఏకం చేసి, వంతుల వారీగా పనుల్లో భాగస్వాములు కావాలని జనశక్తి పిలుపునిచ్చింది. దీంతో నెల రోజుల్లోనే చెరువు తవ్వకం పూర్తయింది. సాయుధ జనశక్తి నక్సలైట్లు సైతం శ్రమదానం చేశారు. నీరు వన్యప్రాణులకు, పశువులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. చెరువు మత్తడి వద్ద స్థానికులు చేపలు పడుతున్నారు.

#### నారాయణ చెరువుకు రెండేళ్లు..

కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల శివారులో జనశక్తి నక్సలైట్లు నారాయణ చెరువు తవ్వారు. వారి పిలుపుతో తరలివచ్చిన ప్రజలు శ్రమదానం చేశారు. మండల ఇంజినీర్ల నుంచి సాంకేతిక సహకారం తీసుకున్నారు. ట్రాక్టర్లు, పరికరాలను పార్టీ పరంగా సమకూర్చారు. ఈ చెరువు పనులు రెండేళ్లపాటు జరిగాయి. చెరువు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. నక్సలైట్లు నిర్మించిన ఈ మూడు చెరువులను అప్పట్లో మానవ హక్కుల సంఘం నేత బాలగోపాల్ బృందం సందర్శించింది. మావోయిస్టు దళనేత కొట్టాల మోహన్‌రెడ్డి, జనశక్తి నేత జంపన్న తమ సొంత గ్రామాల్లోనే చెరువులు తవ్వారని బాలగోపాల్ అప్పట్లో విమర్శనాత్మక వ్యాసాలు రాయడం చర్చనీయాంశమైంది.

#### నేనూ పనికి పోయిన



ఊరంతా చెరువు కోసం పని చేసిన్రు. నేనూ నెలరోజుల పాటు పోయిన. ఆ చెరువే ఇప్పుడు ఆధారమైంది. నాకు రెండెకరాల పొలం ఉంది. జంపన్న చొరవతోనే చెరువు తవ్వినం. అందుకే దానికి ఆయన పేరు పెట్టిన్రు.

– భూక్యా తేజనాయక్, రైతు, రంగంపేట

#### ఊర్లకు రోడ్డు వేశాం




రంగంపేటలో పార్టీ ప్రోద్బలంతో మార్గండి చెరువు తవ్వాం. అప్పటికే ఊరిలోకి రోడ్డు లేకుంటే వేశాం. ట్రాక్టర్లకు డీజిల్‌ను పార్టీ పరంగా సమకూర్చాం. జంపన్న నాయకత్వంలో కులాలవారీగా జనాన్ని కదిలించాం.

– ఎడ్ల లక్ష్మీరాజం ఉరఫ్ సాగర్, జనశక్తి రాష్ట్ర మాజీ నాయకుడు



రంగంపేట మార్గండి చెరువు వద్ద జంపన్న స్మారక స్తూపం





## బీటీ రోడ్డుకు పగుళ్లు

మంథని: మట్టిరోడ్డుతో అవస్థలు పడుతున్న అన్నదాతలు సులువుగా పంట పొలాలకు వెళ్లేందుకు ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో ఉండగానే పగుళ్లు చూపింది. పలుచోట్ల మట్టి కోతకు గురైంది. మంథనిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో బన్నె చెరువు మీదుగా ఖానాపూర్ వరకు 2.2 కిలోమీటర్ల రోడ్డు, కల్వర్టులు, ఫార్మేషన్ రోడ్డును రూ.1.50 కోట్లతో చేపట్టారు. 2023 మే 17న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాగా కొద్ది రోజులకే పగుళ్లు చూపడం, కట్టపై మట్టి కొట్టుకుపోవడంతో మూల మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షాల కారణంగా రోడ్డు, ఫార్మేషన్ దెబ్బతిందా లేదా..? పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# ఏటా మునుగుతున్న జెన్‌కో క్వార్టర్లు

- ఆరు దశాబ్దాల క్రితం నిర్మాణం
- బిక్కుబిక్కుమంటున్న ఉద్యోగులు

రామగుండం: వర్షాకాలం వచ్చిందంటే చాలు జెన్‌కో క్వార్టర్లు వరదలో ముంపునకు గురవుతున్నాయి. ఏటా క్వార్టర్లలోకి నీరు చేరడం.. 60 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో గోడలు తడిచి ఇళ్లు లీకేజీ అవుతున్నాయి. ఫలితంగా సిమెంట్ పైకప్పు, గోడలు పెచ్చులూడుతున్నాయి. వర్షం తగ్గినా క్వార్టర్లలో చేరిన వరద వెళ్లేందుకు చాలా సమయం పడుతోంది.

#### జెన్‌కో క్వార్టర్ల వివరాలు

రామగుండంలో జెన్‌కో క్వార్టర్లను ఉద్యోగుల స్థాయిని బట్టి విభజించారు. ఏ, బీ, సీ, డీ, ఈలో 338, బీ–కాలనీలో ఏఈ, ఈ, ఎఫ్, జీ, టీవీ టైపు క్వార్టర్లు 18, సీ కాలనీలో ఎస్‌ఓ, ఏఈ, యూఎల్, హెచ్ టైపుల్లో 184, సీకాలనీలోని హాస్టల్‌లో 24 ఫ్యామిలీ సూట్స్, అన్ని టైపులలో కలిపి 664 క్వార్టర్లు ఉన్నాయి. ఎడ్యుకేషన్ విభాగం అధికారులకు 8 క్వార్టర్లు, రెవెన్యూ/మున్సిపల్ సిబ్బందికి 7, మెడికల్ విభాగానికి 12, పోలీస్‌లకు 21, ట్రాన్స్‌కోకు 9, పీఅండ్‌టీకి 3, కాంట్రాక్టర్లకు 11, బ్యాంకు సిబ్బందికి 9, ఎస్పీఎఫ్ 22, విద్యుత్ కార్మిక సంఘాలకు 9, పెన్షనర్లకు 20, జెన్‌కో కార్మికులకు 201, దూరదర్శన్‌కు 2 క్వార్టర్ల చొప్పున కేటాయించారు. అయితే ఏటా వరద తాకిడికి గురవుతుండడం.. ఎప్పుడు కూలుతాయో తెలియక ఇందులో సగం మంది ఖాళీ చేసి వెళ్లిపోరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



వరద ముంపులో జెన్‌కో క్వార్టర్లు

#### మరమ్మతుకు నిధులు



జెన్‌కో క్వార్టర్ల సిమెంట్ పనుల నిమిత్తం ఏటా రూ.పది లక్షలు కేటాయిస్తున్నాం. క్వార్టర్లలో వరద నీటిని అరికట్టేందుకు రూ.20 లక్షలు వెచ్చించేందుకు విద్యుత్ సౌధకు నివేదించాం. కాలం చెల్లిన క్వార్టర్లు కావడంతో నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోంది.

– పి.విజేందర్, బీ–థర్మల్ ఎస్ఈ

## మాధవరావు చెరువు పరిశీలన



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని బేగంపేట శివారులోని మాధవరావు చెరువు కట్టను శనివారం తహసీల్దార్ రాంమ్మోహన్, ఇరిగేషన్ డీడీ, ఏఈలతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మాధవరావు చెరువు కట్ట కొంత వరకు కోతకు గురైంది. అధికారులు పరిశీలించి ఇసుక బస్తాలతో పూడ్చివేయించారు. మళ్లీ భారీ వర్షాలు పడితే చెరువు కట్ట తేగే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. వారివెంట ప్రజాప్రతినిధులు, రైతులున్నారు.

## పేస్కేలు వర్తింపజేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్: ఉపాధిహామీ పథకం అమలులో కీలకంగా పనిచేసిన ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేయాలని రాష్ట్ర మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, టీఎస్‌జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌కు వినతిపత్రాలు అందించినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు పేస్కేలు వర్తింపజేయాలని కోరారు. నాయకులు కృష్ణాగౌడ్, రమేశ్, జగదీశ్, మమత రెడ్డి, సత్యప్రకాశ్, హరీశ్, చంద్రమౌళి, హసన్, సాంబాజీ, హరికృష్ణ, రమేశ్, కొమురయ్య, సాయికృష్ణ, సునీల్ తదితరులున్నారు.



### బురదమయంగా గోదావరి తీరం



మంథని: వరద ఉధృతి తగ్గడంతో మంథని గోదావరి తీరం బురదమయమైంది. నదిలోకి వెళ్లే దారిలో బురద పేరుకుపోవడంతో భక్తులకు అసౌకర్యం కలిగింది. చెత్తాచెదారం కొట్టుకొచ్చింది. విద్యుత్ వైర్లు తెగిపడగా రేకులు, ఇతరత్రా సామగ్రి చెల్లా చెదురయ్యాయి. పలు నిర్మాణాలు ధ్వంసమయ్యాయి.

## కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. శనివారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని ఆడిటోరియంలో యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ల సమక్షంలో జరిగిన చర్చలు ఆగస్టు 3కు వాయిదాపడ్డాయి. హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరగనున్న చర్చల నేపథ్యంలో కొంతమేర సఫలీకృతం అయ్యే విధంగా ఉన్నట్లు సమాచారం. సమావేశంలో కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, ఎం.శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, శ్రీనివాస్, రాజమల్లయ్య, సత్యనారాయణ, సత్యం, గీట్ల లక్ష్మారెడ్డి, యాజమాన్యం ప్రతినిధులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాటక్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కారంగుల మొగిలి (51) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండ్రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మొగిలికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. పెద్దపల్లిలోని ఆస్పత్రిలో చేరగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మొగిలి మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు అరుణ్, కూతురు స్రవంతి ఉన్నారు.